క్లుప్తంగా

క్రీడా స్ఫూర్తితో ముందుకెళ్లాలి



శాయంపేట : క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ముందుకెళ్లాలని మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణరెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని రైజింగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులకు శనివారం రూ. 10వేల విలువచేసే టీషర్ట్స్, లోయర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు, యువకులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడల ద్వారా ఆరోగ్యంగా, ధృడంగా ఉంటారని అన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు. క్రీడా స్ఫూర్తితో స్నేహభావం పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శాయంపేట మాజీ ఉపసర్పంచ్ సుమన్, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు మారెపల్లి మోహన్, మైలారం మాజీ సర్పంచ్ ప్రసాద్, గ్రామ శాఖ అధ్యక్షుడు రాజేందర్, యూత్ నాయకుడు రాకేష్, రైజింగ్ స్టార్ యూత్ నాయకులు కల్యాణ్, సూర్య, అఖిల్, నాగరాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..



ఆత్మకూరు : మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో పీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ కొనసాగుతుండగా జైశ్రీరాం క్రికెట్ జట్టుకు బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు గట్టు వేణుగౌడ్ టీషర్ట్స్ పంపిణీ చేశారు. సకినబోయిన రమేశ్, వజ్ర రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డప్పు కళాకారులకు దుస్తులు అందజేత



ఐనవోలు : మండలంలోని కొండపర్తి గ్రామంలో 14 మంది డప్పు కళాకారులకు దాత గుండోజి లక్ష్మీకాంతమ్మ దుస్తులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన బొక్కల నారాయణ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 7న చలో హైదరాబాద్ వెయ్యి గొంతుకలు, లక్ష డప్పుల కార్యక్రమం ఉంటుందన్నారు. అందరూ తరలిరావాలని కోరారు.

బీజేపీ మండల అధ్యక్షుల ఎన్నిక



కమలాపూర్ : బీజేపీ మండల అధ్యక్షుడిగా మండలంలోని ఉప్పలపల్లికి చెందిన ర్యాకం శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా ఉప్పల్‌కు చెందిన బండారి సుధాకర్ నియామకమైనట్లు ఆ పార్టీ జిల్లా ఎన్నికల అధికారి, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఈ మేరకు శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. కాగా సీనియర్ నాయకుల అభిప్రాయాలు తీసుకోవాలి పలువురు నాయకులు తీర్మాణం చేశారు.

దామెర అధ్యక్షుడిగా రాజ్‌కుమార్



దామెర : భారతీయ జనతా పార్టీ దామెర మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన వేల్పుల రాజ్‌కుమార్‌ను నియమించినట్లు జయశంకర్ భూపాలపల్లి జిల్లా సంస్థగత ఎన్నికల అధికారి పెద్దోళ్ల గంగారెడ్డి శనివారం ప్రకటించారు. తన ఎన్నికకు సహరించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, డాక్టర్ పగడాల కాళీప్రసాద్‌రావు, డాక్టర్ విజయ్‌చందర్ రెడ్డి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధుడు ఓబన్నకు ఘన నివాళి

నర్సంపేట : పట్టణంలో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డెర ఓబన్న 218వ జయంతి వేడుక శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కార్యక్రమానికి హాజరై ఓబన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఓబన్న మొదటితరం స్వాతంత్ర్య పోరాటంలో క్రియాశీలకంగా పాల్గొన్నారని చెప్పారు. ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి నాయకత్వంలో జరిగిన సాయుధ పోరాటంలో ఓబన్న దళాలకు స్ఫూర్తినిచ్చారని ఆయన కొనియాడారు.

పోస్టర్ ఆవిష్కరణ

పర్వతగిరి : మండలంలోని జమాల్‌పురంలోని ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్/కాలేజీలో గురుకుల ప్రవేశ పరీక్ష పోస్టర్‌ను ప్రిన్సిపాల్ శైలజారాణి శనివారం ఆవిష్కరించారు. అనంతరం తల్లితండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 2025–06 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో ప్రవేశాలతోపాటు 6 నుంచి 9వ తరగతుల్లోని ఖాళీల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు.

నిధులు లేక.. పనులు సాగక



అసంపూర్తిగా నిలిచిన వంతెన నిర్మాణ పనులు



కంకర పోసి వదిలేసిన రోడ్డు

- అసంపూర్తిగా వంతెన నిర్మాణ పనులు
- కొత్తకొండ జాతరకు వెళ్లే భక్తులకు తప్పని తిప్పలు
- త్వరగా పూర్తిచేయాలని డిమాండ్

వేలేరు : మండల కేంద్రం నుంచి కొత్తకొండ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో గల ఎల్లమ్మవాగుపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు నిధులు లేకపోవడంతో ముందుకు కదలడం లేదు. నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండటంతో ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంతెన నిర్మించిన ప్రదేశంలో రోడ్డుపై మట్టి పోసి వదిలేయడం, పక్కనున్న బీటీ రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడడంతో ప్రయాణించేందుకు నరకప్రాయంగా మారిందని పలువురు వాపోతున్నారు. గత వర్షాకాలంలో భారీ వర్షాలకు ఎల్లమ్మవాగు పొంగి పొర్లడంతో పరిసర ప్రాంతాలు నీట మునిగాయని, దీంతో వాహనదారులు పక్క గ్రామాల గుండా ప్రయాణించే పరిస్థితి దాపురించిందని ప్రయాణికులు తెలిపారు. ప్రస్తుతం సంక్రాంతి పండుగ సందర్భంగా కొత్తకొండ గ్రామంలో నిర్వహించే వీరభద్రస్వామి జాతరకు వేలేరుతో పాటు ధర్మసాగర్, చిల్పూర్, తదితర మండలాల నుంచి వివిధ వాహనాల్లో వేలాది మంది భక్తులు ఈదారి గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. వంతెన నిర్మాణం, కొంతమేర బీటీ రోడ్డు పూర్తికాకపోవడంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నిధులు లేక నిలిచిన పనులు..

ఎల్లమ్మ వాగుపై రెండు వంతెనలు, ఇతర కల్వర్టుల నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.3 కోట్ల 50 లక్షలు నిధులు కేటాయించింది. టెండర్లు దక్కించుకున్న సంబంధిత కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టి కల్వర్టులు, ఎల్లమ్మవాగుపై హైలెవల్ వంతెన నిర్మాణం పూర్తిచేసి పక్కనున్న మరో వంతెన పనులు మొదలు పెట్టి 90 శాతం పూర్తిచేశాడు. అయితే సదరు కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో పనులు మధ్యలోనే వదిలేశాడు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా వంతెన, బీటీ రోడ్డు పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

త్వరగా పూర్తిచేయాలి

వేలేరు నుంచి కొత్తకొండకు వెళ్లే దారిలో ఎల్లమ్మ వాగుపై నిర్మిస్తున్న వంతెన, బీటీ రోడ్డు నిర్మాణం పూర్తికాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఆదారి గుండా వెళ్లే బీటీ రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వంతెనకిరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ఆదమరిచి వెళ్తే ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు బీటీరోడ్డు వేసి వంతెన నిర్మాణ పనులు పూర్తిచేయాలి

– జోడుముంతల కిరణ్, స్థానికుడు

సన్నాహక ప్రదర్శనను జయప్రదం చేయాలి



కమలాపూర్ : నినాదాలు చేస్తున్న నాయకులు

కమలాపూర్ : ఈనెల 19న హనుమకొండ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న వెయ్యి గొంతులు, లక్ష డప్పుల సన్నాహక ప్రదర్శనను జయప్రదం చేయాలని ఎమ్మెస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు చిలువేరు సంపత్ పిలుపునిచ్చారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ముత్యాల రమేశ్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలనే డిమాండ్‌తో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన వెయ్యి గొంతులు, లక్ష డప్పుల మహా ప్రదర్శనకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ ప్రదర్శన విజయవంతానికి హనుమకొండలో సన్నాహక ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, ఎమ్మెస్పీ జిల్లా కార్యదర్శి రవీందర్, నాయకులు ప్రసాద్, చంద్రమౌళి, రమేశ్, మొగిలి, సారంగం, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

సన్‌రైజ్ పాఠశాలలో ముగ్గుల పోటీలు



శాయంపేట : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని ప్రగతిసింగారం గ్రామంలో గల సన్‌రైజ్ పాఠశాలలో శనివారం ముందస్తు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రథమ బహుమతి సాన్విత, ద్వితీయ బహుమతి జాహ్నవి, కన్సోలేషన్ బహుమతి అక్షయ సాధించగా పాఠశాల ప్రిన్సిపాల్ తిరుపతి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిరెడ్డి, సోనీ, జ్యోతి, రచన, వీణ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

నేడు మెగా రక్తదాన శిబిరం

కమలాపూర్ : జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రగతి యువజన సంక్షేమ సంఘం, ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు బాలసాని కుమారస్వామి, పబ్బు అశోక్ శనివారం ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆదివారం ఉదయం 9 గంటలకు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సహకారంతో రక్తదాన శిబిరం ప్రారంభం కానుందని, తలసేమియా బాధితులు, అత్యవసర సమయాల్లో రక్తం అవసరమైన వారి కోసం దాతలు ముందుకొచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

బీజేపీ విజయోత్సవ ర్యాలీ

పరకాల : బీజేపీ పట్టణ, రూరల్ మండల అధ్యక్షులుగా నియామకం సందర్భంగా శనివారం పట్టణంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర నాయకులు కాశీప్రసాద్, పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, ముల్కప్రాసద్, పూర్ణచారి, మార్త భిక్షపతి, కుక్కల విజయ్‌కుమార్, సంగ పురుషోత్తం, రామన్న, శారద, సంగీత, నరేష్, శక్తి కేంద్రం, బూత్ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

దామెర : మండలంలోని ఊరుగొండ గ్రామంలో లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం బిందె తీర్థం, హోమం, బలిహరణం కార్యక్రమాలను వేద పండితులు నిర్వహించారు. ఈనెల 15,16వ తేదీల్లో గ్రామ సమీపంలోని గుట్ట వద్ద జాతర ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని అర్చకుడు తూపు రాణి శ్రీనివాసాచార్యులు కోరారు.

వైభవంగా హనుమాన్‌పూజ



ఆత్మకూరు : మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని హనుమాన్ పూజలు వైభవంగా జరిగాయి. అర్చకుడు ఆరుట్ల మాధవమూర్తి అభిషేకాలు, చందనోత్సవం చేపట్టారు. అలాగే ఆలయంలో కూడారై మహోత్సవం నిర్వహించారు. భక్తులు తిరుప్పావై పారాయణం చేశారు. వేంకటేశ్వరస్వామి శరణాగతి దీక్షాదారులు గ్రామంలో నగర సంకీర్తన నిర్వహించారు.

జాతీయస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపిక



ఐనవోలు : మండలంలోని ఏకశిలా స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న కొండేటి జెస్సీ రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో ప్రథమస్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎండీ బాబా తెలిపారు. విద్యార్థిని ఉత్తమ ప్రతిభ చూపడంలో సహకరించిన గైడ్ టీచర్ రమేశ్, విద్యార్థి జెస్సీను శాలువాతో సత్కరించి అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ రవికిరణ్ పాల్గొన్నారు.

ముళ్లపొదల తొలగింపు



శాయంపేట : మండ కేంద్రం నుంచి మాందారిపేట శివారులోని కస్తూర్బాగాంధీ బాలికల గురుల పాఠశాల సమీపంలో గల మలుపు వద్ద తరుచు ప్రమాదాలకు కారణమవుతున్న ముళ్లపొదలను ఎస్సై జక్కుల పరమేశ్ శనివారం జేసీబీతో తొలగింపజేశారు. మలుపుల వద్ద వాహనదారులు నెమ్మదిగా వెళ్లాలని ఆయన సూచించారు. ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు తొలగింపజేయడంతో వాహనదారులు హర్షంవ్యక్తం చేశారు.

కుమార్‌గాడ్గేకు సన్మానం



ఆత్మకూరు : రజక రిజర్వేషన్ పోరాటసమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్‌గాడ్గేను మండలంలోని నాగయ్యపల్లిలో శనివారం డీబీఎఫ్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ మాట్లాడుతూ.. చాపర్తి కుమార్‌గాడ్గే కామారెడ్డి డిక్లరేషన్ అమలుకోసం 17రోజుల ఆమరణ దీక్ష చేశారని దాని ఫలితంగానే ప్రభుత్వం కులగణన ప్రారంభించిందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను పెంచాలని కుమార్ గాడ్గే డిమాండ్ చేశారు. సుదర్శన్, అశోక్, శ్రీనివాస్, భాస్కర్, ప్రసంగి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అనారోగ్యంతో గీతకార్మికుడి ఆత్మహత్య

కమలాపూర్ : అనారోగ్యంతో బాధపడుతున్న గీత కార్మికుడు గుర్తుతెలియని పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని కన్నూరుకు చెందిన రావుల మొగిలి (55) అనే గీతకార్మికుడు అనారోగ్యంతో శనివారం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కల్లు గీత వృత్తితో జీవనం సాగించే మొగిలి గత కొంత కాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలోనే శనివారం కిడ్నీ నొప్పు భరించలేక వారి ఇంటి సమీపంలోని వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో గుర్తుతెలియని పురుగులమందు తాగాడు. గమనించిన స్థానికులు అతడి కుమారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అతడిని ద్విచక్ర వాహనంపై, ఆ తర్వాత మార్గమధ్యలో 108 వాహనం ద్వారా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు. మృతుడి కుమారుడు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

ఉడుతలను వేటాడిన వ్యక్తి అరెస్ట్

శాయంపేట : మండల కేంద్రంలోని దేవుని చెరువు దగ్గర గంగిరెద్దులు ఆడించే నరాల రాజయ్య ఉడుతలను వేటాడుతుండగా పట్టుకొని అరెస్ట్ చేసినట్లు ఫారెస్ట్ డిప్యూటీ రేంజీ ఆఫీసర్ మైసయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలం కందుల గ్రామానికి చెందిన నరాల రాజయ్య బతుకుదెరువు నిమిత్తం మండలంలోని కొప్పుల గ్రామంలో నివసిస్తూ చుట్టుపక్క గ్రామాల్లో గంగిరెద్దులు ఆడిస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి మండల కేంద్రంలోని దేవుని చెరువు దగ్గర ఉడుతలను వేటాడుతుండగా ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ హనుమకొండ జిల్లా సభ్యుడు మారెపల్లి సునీల్ గమనించి అడ్డుకున్నాడు. దీంతో జిల్లా అటవీ శాఖ అధికారి లావణ్యకు సమాచారం అందించాడు. స్పందించిన ఆమె రాజయ్యను పట్టుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకుని వేటగాడి దగ్గర ఉన్న వేటా సామగ్రిని స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

సిరికొండ పరామర్శ



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన పాత్రికేయుడు బాల్నే తిలక్‌బాబు ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ స్పీకర్, శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తిలక్‌బాబు మృతి తనను బాధించిందని తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని అన్నారు. కుటుంబ సభ్యుల పరిస్థితిని తెలుసుకున్న ఆయన.. ధైర్యంగా ఉండాలని మనోధైర్యం చెప్పారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఎన్నికల హామీలు వెంటనే నెరవేర్చాలి

శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

శాయంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలపై, నాయకులపై దాడులు చేయకుండా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి సూచించారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాల అమలు మర్చిపోయిందని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులపై దాడి చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేరవేర్చకుంటే బీఆర్ఎస్ పార్టీ ప్రధాన ప్రతిపక్షంగా ప్రశ్నిస్తుందని హెచ్చరించారు. రూ.2లక్షల రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, చాలామంది రైతులకు మాఫీ కాలేదని అన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్‌ను టార్గెట్ చేయకుండా పాలనపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మంచినీటి బావి



ప్రమాదకరంగా ఉన్న మంచినీటి బావి

వేలేరు : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న గ్రామపంచాయతీ మంచినీటి బావి ప్రమాదకరంగా ఉందని స్థానికులు తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు గొడవ పడి క్షణికావేశానికి లోనై మంచినీటి బావిలో దూకుతున్నారని అన్నారు. కొన్ని రోజుల క్రితం మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ కుటుంబంలోని గొడవల కారణంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చిందని, పోలీస్ స్టేషన్ ఎదుట ఇరువర్గాలు మాట్లాడుకుంటున్న తరుణంలో మహిళ క్షణికావేశానికి లోనై నేరుగా వెళ్లి మంచినీళ్ల బావిలో దూకిందని తెలిపారు. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే బావిలోకి దిగి ఆమెను రక్షించి జాగ్రత్తగా బయటకు తీసినట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునారావృతం కాకముందే సంబంధిత శాఖ అధికారులు స్పందించి మంచినీటి బావికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా నమ్మాళ్వార్ పరమపదోత్సవం



ఐనవోలు : కక్కిరాలపల్లిలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అధ్యయన ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి నమ్మాళ్వార్ పరమపదోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరత్నం ఆచార్యులు మాట్లాడుతూ.. శ్రీవైష్ణవాన్ని ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన విష్ణువు పన్నెండు మంది అత్యున్నత భక్తులుగా ఆళ్వార్లను పరిగణిస్తారన్నారు. నమ్మాళ్వార్ పన్నెండు మంది ఆళ్వార్లలో ఐదవ వ్యక్తిగా పరిగణించడుతున్నట్లు చెప్పారు. వైష్ణవ సాంప్రదాయంలో గొప్ప ఆధ్యాత్మికవేత్తగా, అగ్రగామిగా ఉన్నాడన్నారు. నాళాయిర దివ్య ప్రబంధంలో 4000 చరణాలలో ఇతని రచనలు 1352 ఉన్నట్లు వివరించారు. ఆళ్వార్లు రచించిన శ్లోకాలను అధ్యయన ఉత్సవంలో స్వామి, అమ్మవార్లకు విజ్ఞాపన చేసినట్లు వివరించారు. నమ్మాళ్వార్‌కు పరమపదం జరిగిన తీరును అనుకరణగా భక్తుల సమక్షంలో ఉత్సవంగా జరిపించినట్లు తెలిపారు.

చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం



శాయంపేట : సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్మికులు, నాయకులు



కమలాపూర్ : సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఝాన్సీ, తదితరులు

శాయంపేట : చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని చేనేత సొసైటీ పీఏసీ చైర్మన్ మామిడి శంకర్‌లింగం అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేనేత కార్మికుల అభివృద్ధి కోసం నూతనంగా మూడు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన సందర్భంగా శనివారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నేతన్న పొదుపు (త్రిఫ్ట్ ఫండ్)లో కార్మికుని వేతనం నుంచి 8 శాతం జమ చేస్తే ప్రభుత్వం 16 శాతం జమ చేస్తుందని అన్నారు. దురదృష్టవశాత్తు కార్మికుడు మృతిచెందితే నేతన్న భద్రత పథకంలో రూ. 5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తుందన్నారు. చేనేత కార్మికులకు అభివృద్ధికి మూడు కొత్త పథకాలు ప్రవేశపెట్టి ఆదుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డికి, రాష్ట్ర చేనేత జౌళీ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చేనేతలు ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీ సభ్యులు రంగు ఆనందం, బూర లక్ష్మీనారాయణ, దాపరి సమ్మయ్య, దిడ్డి ప్రభాకర్, మెండు సమ్మక్క, బాసాని పద్మ, కార్మికులు పాల్గొన్నారు.

కమలాపూర్ : చేనేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చేనేత అభయహస్తం పథకానికి శ్రీకారం చుట్టి రూ.168 కోట్లు కేటాయించడం హర్షించదగిన విషయమని ఏఎంసీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో శనివారం చేనేత కార్మికులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం చేనేత అభయహస్తం పథకం ద్వారా నేతన్న పొదుపు ద్వారా రూ.115 కోట్లు, నేతన్న భద్రత కింద రూ.9 కోట్లు, నేతన్న భరోసా ద్వారా రూ.44 కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. చేనేత అభయహస్తం పథకానికి రూ.168 కోట్ల నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, చేనేత, జౌళి శాఖ కమిషనర్ శైలజారామయ్యార్‌కు చేనేత కార్మికుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ రవీందర్, చేనేత కార్మికులు వెంకటపతి, సమ్మయ్య, యాదగిరి, ప్రమీల, చంద్రకళ, సరిత, సునీత, సవిత, రాజమౌళి, పర్వతాలు, రాజమౌళి, రాజమణి, ప్రమీల పాల్గొన్నారు.

శోభాయాత్రను విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రాధాకృష్ణ

ఆత్మకూరు : ఈనెల 30న హనుమకొండలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో చిన్నజీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో నిర్వహించనున్న సంకీర్తన మండలి శోభాయత్రను విజయవంతం చేయాలని వికాసతరంగిణి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బచ్చు రాధాకృష్ణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం వికాసతరంగిణి సమావేశంలో ఆయన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఈనెల 30న చిన్నజీయర్‌స్వామి పర్యవేక్షణలో హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్ నుంచి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వరకు శోభాయాత్ర నిర్వహించి, మైదానంలో స్వామి ప్రవచనాలు ఉంటాయన్నారు. సంకీర్తన మండలి సభ్యులు, కోలాట బృందాలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. వికాసతరంగిణి బాధ్యులు కేశవమూర్తి, మాధవమూర్తి, రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

గీసుకొండ : స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని కీర్తినగర్ కాలనీలోని పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న వారి నుంచి రూ.29 వేల 130 నగదు స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ ఎల్.పవన్‌కుమార్ తెలిపారు.